# బీజేపీ పాలనపై నిఘా: విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేస్తాం : కాంగ్రెస్

**చిన్న అవినీతి జరిగినా సహించం... ప్రతి డివిజన్‌పై పర్యవేక్షణ**

**కార్పొరేషన్ అభివృద్ధికి సహకరిస్తాం, అక్రమాలపై కఠిన చర్యలు కోరుతాం**




కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్తగా ఏర్పడిన బీజేపీ పాలకవర్గం పారదర్శకంగా పనిచేయాలని, ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగితే వాటిని సహించబోమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు హెచ్చరించారు. నగరపాలక సంస్థలో అవినీతి జరగకుండా ప్రత్యేకంగా విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేసి ప్రతి డివిజన్‌లో జరిగే పనులను పర్యవేక్షిస్తామని తెలిపారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో చిన్న అవినీతి జరిగినా విడిచిపెట్టే ప్రసక్తే లేదని, అభివృద్ధి పనులు, బిల్డింగ్ పర్మిషన్లు, బిల్లుల చెల్లింపులు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు. ప్రతి డివిజన్‌లో ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి "కరీంనగర్ రైజింగ్ ఆర్గనైజేషన్" పేరిట పర్యవేక్షణ వ్యవస్థను ప్రారంభిస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత, ఖర్చుల వివరాలు, ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతరం పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. బీజేపీ పాలకవర్గం పారదర్శకంగా పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని సూచించిన రాజేందర్ రావు, గతంలో జరిగిన అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. ఏవైనా అవకతవకలు గమనించినట్లయితే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ కరీంనగర్ అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు సహకారంతో నగరానికి అవసరమైన నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరగాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందాలని పేర్కొన్నారు. నగరంలో అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా క్లీన్ పాలన సాగించేలా నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రజల పక్షాన నిలబడి పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆకుల నర్మద, గుమ్మడి రాజ్‌కుమార్, ఆకుల నందిని, పడిశెట్టి వసంతలక్ష్మి, కల్లేపల్లి శారద తదితరులు పాల్గొన్నారు.

# అక్షర చిట్ ఫండ్ డైరెక్టర్ శ్రీవిద్య అరెస్ట్

**బెంగళూరు విమానాశ్రయంలో పట్టుకున్న పోలీసులు**

**కోర్టులో హాజరు : రిమాండ్‌కు జైలుకు తరలింపు**



హనుమకొండ, జనతా న్యూస్: అక్షర చిట్ ఫండ్ సంస్థ డైరెక్టర్ పేరాల శ్రీవిద్యను హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసులు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం అక్షర చిట్ ఫండ్ సంస్థలో చిట్టీలు వేసిన వందలాది మంది బాధితులకు గడువు పూర్తయ్యినప్పటికీ డబ్బులు చెల్లించలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలువురు బాధితులు సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేశారు. సంస్థ యాజమాన్యం మోసం చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే చిట్ ఫండ్ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రావుపై పలు కేసులు నమోదు కాగా, రెండు సార్లు జైలుకు కూడా వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మరో రెండు కేసుల్లో శ్రీనివాస్ రావుతో పాటు ఆయన భార్య శ్రీవిద్యను కూడా నిందితులుగా చేర్చినట్లు సమాచారం. ఈ కేసుల్లో ఇద్దరూ కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలిసింది. విదేశాల్లో ఉన్న శ్రీవిద్య ఇటీవల అమెరికా నుంచి భారత్‌కు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో బెంగళూరు విమానాశ్రయంలో దిగిన వెంటనే ఆమెను సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హనుమకొండకు తరలించి న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు ఆమెను నర్సంపేట జైలుకు రిమాండ్‌కు పంపినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని, బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# యూరియా యాప్ ద్వారానే అమ్మకాలు : కలెక్టర్

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ జిల్లాలో జనవరి 31వ తేదీ నుంచి యూరియా అమ్మకాలు పూర్తిగా యూరియా యాప్ ద్వారానే జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు యాప్ ద్వారా సులభంగా బుకింగ్ చేసుకుని సమీప డీలర్ వద్ద ఎరువులు పొందవచ్చని సూచించారు. ఈరోజు వరకు జిల్లా వ్యాప్తంగా 51,936 మంది రైతులు యూరియా యాప్ ద్వారా మొత్తం 1,72,191 యూరియా బస్తాలను బుక్ చేసుకున్నారు. అందులో 1,43,933 బస్తాలను ఇప్పటికే రైతులు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 725 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. కావున జిల్లాలోని రైతులంతా యూరియా యాప్‌ను వినియోగించి సులభంగా బుకింగ్ చేసుకుని తమకు సమీపంలోని డీలర్ వద్ద యూరియా కొనుగోలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన బల్దియా ప్రమాణ స్వీకారం...

# బీజేపీ అభ్యర్థుల విజయం

**మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా యాదగిరి సునీల్ రావు ఎన్నిక**

**ప్లాకార్డు ఓటింగ్‌లో బీజేపీకి మెజారిటీ... కాంగ్రెస్ అభ్యర్థులకు 21, 22 ఓట్లు**

**ప్రమాణ స్వీకారం, ఎన్నికల ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహణ**



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అబ్జర్వర్లు జితేందర్ రెడ్డి, మనోహర్ సమక్షంలో కార్యక్రమం జరిగింది. మొదటగా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తెలుగు అక్షరమాల క్రమంలో 66 మంది కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, ఇండిపెండెంట్లు, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన సభ్యులకు ఆథరైజ్డ్ అధికారి, ఆర్డీవో మహేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం 11:30 నుంచి 12:30 వరకు ఈ కార్యక్రమం కొనసాగింది.

### మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక

ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్ పరోక్ష ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరై తన ఓటు వినియోగించారు.

బీజేపీ తరఫున మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా యాదగిరి సునీల్ రావు బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి మేయర్ అభ్యర్థిగా ఆకుల నర్మధ, డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా హీనా అఫ్రీన్ పోటీలో ఉన్నారు.

### ఓటింగ్ ఫలితాలు

మేయర్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఆకుల నర్మధకు కాంగ్రెస్‌కు చెందిన 14 మంది సభ్యులు, 3 ఇండిపెండెంట్లు, 3 ఎంఐఎం సభ్యులు, 1 ఫార్వర్డ్ బ్లాక్ సభ్యుడు మద్దతు తెలపగా మొత్తం 21 ఓట్లు వచ్చాయి.

బీజేపీ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్‌కు 30 బీజేపీ సభ్యులు, 3 స్వతంత్రులు, ఎక్స్ అఫీషియో ఓటుతో కలిపి మొత్తం 34 ఓట్లు లభించాయి.

డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూడా బీజేపీ అభ్యర్థి యాదగిరి సునీల్ రావుకు 34 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి హీనా అఫ్రీన్‌కు 22 ఓట్లు వచ్చాయి.

బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉండగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించలేదు.




### ఫలితాల ప్రకటన

మెజారిటీ ఓట్లు బీజేపీ అభ్యర్థులకు రావడంతో ఆర్డీవో మహేశ్వర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా యాదగిరి సునీల్ రావును అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఇద్దరికీ ప్రమాణ స్వీకారం చేయించారు. మేయర్‌గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్ కౌన్సిల్ హాల్‌లో బాధ్యతలు స్వీకరించి మేయర్ కుర్చీలో ఆసీనులయ్యారు.

### అభినందనలు, ధన్యవాదాలు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొత్తగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్‌లకు అభినందనలు తెలిపారు. ఎన్నికలో మద్దతు తెలిపిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులందరూ కలిసి నగరాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాలో మున్సిపల్ చైర్పర్సన్ ఎన్నికలు పూర్తి

**మూడు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్, హుస్నాబాద్‌లో కాంగ్రెస్ ఆధిపత్యం**

సిద్దిపేట, జనతా న్యూస్: సిద్దిపేట జిల్లాలోని మున్సిపాలిటీలకు నూతనంగా చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్‌ల ఎన్నికలు పూర్తయ్యాయి. జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం పలు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధిపత్యం కొనసాగగా, హుస్నాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది.



చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ ముస్త్యాల

### చేర్యాల మున్సిపాలిటీ:

చైర్పర్సన్‌గా అరుణ ముత్యాల (బీఆర్ఎస్), వైస్ చైర్పర్సన్‌గా మేడిశెట్టి ఉమా (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు.



దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత

### దుబ్బాక మున్సిపాలిటీ:

చైర్పర్సన్‌గా శ్రీరామ్ సంగీత (బీఆర్ఎస్), వైస్ చైర్పర్సన్‌గా ఆశ సులోచన (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు.

### గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ:

చైర్పర్సన్‌గా గంగిశెట్టి చందన (బీఆర్ఎస్), వైస్ చైర్పర్సన్‌గా కళ్యాణ్‌కార్ పద్మాబాయి (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు.

### హుస్నాబాద్ మున్సిపాలిటీ:

చైర్పర్సన్‌గా దండి లక్ష్మి (కాంగ్రెస్), వైస్ చైర్పర్సన్‌గా పద్మ చిత్తారి (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. జిల్లాలో జరిగిన ఈ ఎన్నికలతో మున్సిపల్ పాలకవర్గాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కొత్తగా ఎన్నికైన చైర్పర్సన్‌లు, వైస్ చైర్పర్సన్‌లు స్థానిక అభివృద్ధి, పౌరసేవల మెరుగుదలపై దృష్టి సారించాలని ప్రజలు ఆశిస్తున్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన




హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి

# హుజూరాబాద్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా

**దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ విజయం**

**చైర్మన్‌గా సుహాసిని, వైస్ చైర్మన్‌గా అంజలి**

**అభ్యర్థుల ఎంపిక నుంచి విజయదాకా ప్రణవ్ సమన్వయం కీలకం**



హుజూరాబాద్, జనతా న్యూస్: హుజూరాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించింది. దశాబ్దాల తర్వాత మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. సోమవారం కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్‌గా రోంటాల సుహాసిని, వైస్ చైర్మన్‌గా గూడూరి అంజలి ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, సమన్వయం వరకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కీలక పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి ఎలాగైనా హుజూరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పట్టుదలతో పనిచేసి విజయాన్ని సాధించారని నాయకులు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రణవ్ ఆధ్వర్యంలో విజయ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గెలిచిన కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడం వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఇటీవల జరిగిన పలు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ జెండా ఎగరవేసిందని, ఇకపై హుజూరాబాద్‌లో ఏ ఎన్నిక జరిగినా ఇదే తీర్పు పునరావృతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హుజూరాబాద్ ప్రజలు ఇచ్చిన మెజారిటీతో మున్సిపాలిటీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయపథంలోనే సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయానికి సహకరించిన హుజూరాబాద్, జమ్మికుంట ప్రజలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్పెషల్ ఎడిషన్
మానేరు జనత®
16-2-2026
ఇది జనం గొంతుక




**కరీంనగర్ నగరపాలక సంస్థ**

మేయర్ పీఠంపై కొనసాగిన రాజకీయ ఉత్కంఠకు సోమవారం తెరపడింది. భారతీయ జనతా పార్టీ ప్రతిపాదించిన 2వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నిక కాగా, మాజీ మేయర్ వై.సునీల్ రావు డిప్యూటీ మేయం గా ఎన్నికయ్యారు. పరోక్ష ఎన్నికల్లో బీజేపీ సమీకరణాలు ఫలించి కరీంనగర్ బల్దియా పీఠం కాషాయ ఖాతాలో పడింది. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ ముందుగానే వ్యూహాత్మకంగా కదిలి స్వతంత్రులు, మద్దతుదారులను తనవైపు తిప్పుకోవడంతో చివరికి మేయర్ పీఠం తమవైపు తిప్పుకుంది. తీవ్ర రాజకీయ పోటీ మధ్య ఈ విజయం పార్టీకి కీలకంగా మారింది.




# సామాన్యుడి నుంచి బల్దియా పీఠం వరకు

**కరీంనగర్** బల్దియా పీఠం కాషాయ ఖాతాలో పడింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఖరారు చేసిన పేర్లను బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు ఆంటోనీ రెడ్డి హైకమాండ్ లేఖను తీసుకుని కరీంనగర్ చేరగా, నగరంలోని వి.కన్వెన్షన్‌లో కార్పొరేటర్ల సమావేశం జరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా ఇన్‌చార్జ్ డా.గంగిడి మనోహర్ రెడ్డి సమక్షంలో హైకమాండ్ నిర్ణయాన్ని కార్పొరేటర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతి పాదించగా, 62వ డివిజన్ కార్పొ రేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. డిప్యూటీ మేయర్‌గా వై. సునీల్ రావు పేరును 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు బలపర్చారు. చొప్పరి జయశ్రీ, వాసాల రమేష్ సహా బీజేపీ కార్పొరేటర్లందరూ చప్పట్లతో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం కార్పొరేటర్లంతా నగర పాలక సంస్థకు చేరుకుని

- బీజేపీ సమీకరణాలు ఫలించాయి
- మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక
- డిప్యూటీ మేయర్‌గా మాజీ మేయర్ వై.సునీల్ రావు
- కార్యకర్త నుంచి కార్పొరేషన్ పీఠం వరకు కొలగాని ప్రస్థానం
- ఏకగ్రీవ మద్దతుతో ఖరారు చేసిన బీజేపీ కార్పొరేటర్లు

ప్రమాణ స్వీకారం చేసి ఎన్నికల్లో పాల్గొన్నారు.

**సామాన్య కార్యకర్తకు మేయర్ పట్టం**

కరీంనగర్ మేయర్ పదవిపై బీసీ వర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు ఆశలు పెట్టుకున్నప్పటికీ, పార్టీకి అంకిత భావంతో పనిచేసిన నాయకుడికి అవకాశం ఇవ్వాలనే నిర్ణయంతో చివరికి కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది.

ఏబీవీపీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగిన సామాన్య కార్యకర్తకు మేయర్ పదవి దక్కడం పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని



నింపింది. పార్టీకి విధేయత, ప్రజల్లో ఉన్న అనుబంధం, సంఘ్ నేపథ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయన ఎంపిక జరిగినట్లు తెలుస్తోంది.

**షాక్‌లో కొలగాని... భావోద్వేగ క్షణాలు**

మేయర్ అభ్యర్థిగా తన పేరును ప్రకటించడంతో కొలగాని శ్రీనివాస్ ఆశ్చర్యానికి గురయ్యారు. కార్పొరేటర్లు అభినందనలు తెలుపుతుండగా ఆనందంతో స్పందించిన ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "సామాన్య కార్యకర్తనైన తనకు మేయర్ బాధ్యతలు వస్తాయని ఊహించలేదని, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే పదవులు స్వయంగా వస్తాయని" అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ ఎంపికపై సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు.



**డిప్యూటీ మేయర్‌గా సీనియారిటీకి ప్రాధాన్యం**

మాజీ మేయర్ వై.సునీల్ రావును డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయడం ద్వారా అనుభవం, సీనియారిటీకి ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పాలనలో సమన్వయం కల్పించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

**సమీకరణాలు ఫలించిన బీజేపీ**

కార్పొరేషన్ ఎన్నికల్లో 66 డివిజన్లలో బీజేపీ 30 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. అనంతరం స్వతంత్రులు, ఇతర మద్దతుదారులతో సంప్రదింపులు జరిపి సంఖ్యాబలం పెంచుకుంది. కార్పొరేటర్లను క్యాంపులకు తరలించడం, మద్దతు సమీకరణాలు చేయడం వంటి వ్యూహాలు ఫలించాయి. చివరికి మేయర్ ఎన్నికలో బీజేపీ శిబిరం విజయం సాధించింది.

**అభివృద్ధి లక్ష్యంగా కొత్త పాలకవర్గం**

మేయర్‌గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్ నగరాభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తామని తెలిపారు. అన్ని వర్గాల కార్పొరేటర్ల సహకారంతో పారదర్శక పాలన అందిస్తామని చెప్పారు. డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు కూడా కొత్త పాలకవర్గం సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు.

**బల్దియాలో కొత్త దశ**

తీవ్ర రాజకీయ పోటీ మధ్య బీజేపీ మేయర్ పీఠం దక్కించుకోవడం పార్టీకి కీలక విజయంగా భావిస్తున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్త పాలకవర్గంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద కార్యకర్త నుంచి మేయర్ వరకు ఎదిగిన కొలగాని శ్రీనివాస్ ప్రస్థానం కరీంనగర్ బల్దియా రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. నగర ప్రజలు కొత్త పాలకవర్గం నుంచి మెరుగైన పౌరసేవలు ఆశిస్తు న్నారు.



## కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ పట్టు...

**- రాజకీయాలకు బండి సంజయ్ హాట్ కామెంట్స్**

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర రాజకీయ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ కార్పొరేటర్లు, కొత్తగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విమర్శలు చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయాలనే పార్టీ కార్యకర్తల కల నెరవేరిందని, ప్రజల మద్దతుతో బీజేపీ ఈ విజయం సాధించిందని ఆయన తెలిపారు. కొత్తగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్‌కు అభినందనలు తెలియజేస్తూ నగరాభివృద్ధికికలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

**కుట్రలపై ఆరోపణలు... రాజకీయ విమర్శలు**

మేయర్ ఎన్నికకు ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి బీజేపీని అడ్డుకునేందుకు ప్రయత్నించాయని బండి సంజయ్ ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పటికీ బీజేపీకి మేయర్ పదవి రాకుండా చేయడానికి పలు వ్యూహాలు అమలు చేశారని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ బీజేపీ కార్పొరేటర్లు, మద్దతుదారుల సహకారంతో పార్టీ విజయం



సాధించిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో గెలిచిన అతిపెద్ద పార్టీకి మేయర్ పదవి దక్కకుండా చేయాలన్న ప్రయత్నాలు జరిగాయని ఆయన విమర్శించారు. అయితే ప్రజల తీర్పు, కార్యకర్తల కృషి ముందు ఆ ప్రయత్నాలు ఫలించలేదని అన్నారు. కరీంనగర్ ప్రజలు బీజేపీకి ఇచ్చిన మద్దతు పార్టీపై ఉన్న విశ్వాసాన్ని చూపుతుందని పేర్కొన్నారు.

**కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం**

మేయర్, డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని బండి సంజయ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకువచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్నికల వరకు రాజకీయాలు సహజమేనని, ఎన్నికల అనంతరం అభివృద్ధి కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని కోరారు. కరీంనగర్ అభి వృద్ధి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహకా రంతో మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కొత్త పాలకవర్గం పారదర్శక పాలన అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**కేడర్ కృషి వల్లే విజయం**

బీజేపీ కార్యకర్తల కృషి, ప్రజల మద్దతు వల్లే ఈ విజయం సాధ్యమైందని బండి సంజయ్ అన్నారు. ఎన్నికల సమయంలో పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ ఫలితం రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపు తుందని పేర్కొన్నారు. మేయర్‌గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు అవినీతి రహిత పాలన అందిస్తారని, ప్రజలకు అందుబాటులో ఉంటారని బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

**రాజకీయ వేడి కొనసాగుతూనే...**

మేయర్ ఎన్నికల అనంతరం కూడా కరీంనగర్ రాజకీయాలు వేడెక్కిన పరిస్థితి కనిపిస్తోంది. పార్టీలు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండగా, నగరాభివృద్ధి, పాలనపై దృష్టి కేంద్రీకరించాలని స్థానికులు ఆశిస్తున్నారు. మొత్తంగా, కరీంనగర్ కార్పొరేషన్‌పై బీజేపీ ఆధిపత్యం కొనసాగుతుండగా, కొత్త పాలకవర్గం పనితీరు ఎలా ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



యాంసాని శివకుమార్
(జనతా న్యూస్ ప్రతినిధి)

## కొలగాని శ్రీనివాస్ పూర్తి బయోడేటా

**వ్యక్తిగత వివరాలు**

పేరు : కొలగాని శ్రీనివాస్
జననం : జూన్ 1989
స్వగ్రామం : తీగలగుట్టపల్లి, కరీంనగర్ జిల్లా
వయస్సు : సుమారు 37 సంవత్సరాలు
విద్యార్హతలు: వీడీూ, మీూఔ
సామాజిక నేపథ్యం: బీసీ వర్గం
వృత్తి/సామాజిక పాత్ర : రాజకీయ కార్యకర్త, సామాజిక సేవకుడు

సంఘ్ సేవా కార్యకలాపాలు2013లో ప్రాథమిక శిక్ష పూర్తి స్వామి వివేకానంద ఆలోచనల ప్రభావం ఏక్తా పరిషత్ ద్వారా సేవా కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 15 సార్లు రక్తదానం, దివాసీల హక్కుల కోసం ఉద్యమాల్లో పాల్గొన్నారు

**విద్యార్థి దశ యువజన ప్రస్థానం**

2005-2007 : విద్యార్థి సమస్యలపై పోరాటాలు
2007--2009 : భారతీయ జనతా యువ మోర్చా యువజన కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వాలంటీర్‌గా సేవలు
2010: కాక తీయ విశ్వవిద్యాలయం ఉత్తమ వాలంటీర్ అవార్డు




**జాతీయ స్థాయి సేవా కార్యక్రమాలు**

నేషనల్ యూత్ ప్రాజెక్ట్ సభ్యత్వం,అసోంలో నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ పాల్గొన్నారు. లక్షద్వీప్, బెంగళూరు, యూపీ, రాజస్థాన్, ఉత్తరాఖండ్, హర్యానా, అండమాన్ నికోబార్ రాష్ట్రాల్లో జాతీయ శిబిరాలు, యువజన, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు

**పురస్కారాలు**

2005: భాయిజీ సేవా పురస్కార్
2010: చీూా ఉత్తమ వాలంటీర్
2021: కరోనా సేవలకు "రక్షక్ అవార్డు" కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.

**రాజకీయ ప్రస్థానం**

| | | |
|---|---|---|
| 2014-2019 | : | మండల ప్రధాన కార్యదర్శి |
| 2020--2025 | : | కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ |
| 2021 | : | కరోనా వ్యాక్సిన్ జిల్లా కన్వీనర్ |
| 2023-2024 | : | టౌన్-1 కన్వీనర్ |
| 2024 | : | రాష్ట్ర ప్రధాన కార్యదర్శి |
| 2025 | : | చొప్పదండి మండల సర్పంచ్ ఎన్నికల ఇన్‌చార్జ్ |
| 2025 | : | 2వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నిక |

**ప్రజా సేవా కార్యక్రమాలు**

కరోనా కాలంలో సేవలు, రక్తదాన శిబిరాలు. యువజన సేవా కార్యక్రమాలు. పర్యావరణ అవగాహన కార్యక్రమాలు. విద్యార్థి, యువజన సమస్యలపై పోరాటం,ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు.

**మేయర్‌గా ఎన్నిక**

2వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం, బీజేపీ హైకమాండ్ ఎంపిక, కార్పొరేటర్ల ఏకగ్రీవ మద్దతు,మాసం గణేశ్ ప్రతిపాదన , శ్రీలేఖ బలపర్చడం,మేయర్‌గా ఎన్నిక.

**ప్రత్యేకతలు**

సామాన్య కార్యకర్త నుంచి మేయర్ స్థాయి వరకు ఎదిగిన నాయకుడు .కేడర్‌కు అందుబాటులో ఉండే నాయకత్వం. సంఘ్ నేపథ్యం. యువజన నాయకత్వ అనుభవం. సామాజిక సేవలో చురుకైన పాత్ర. కొలగాని శ్రీనివాస్ ప్రస్థానం ఏబీవీపీ కార్యకర్త నుంచి కరీంనగర్ మేయర్ వరకు సాగిన అరుదైన ఉదాహరణగా నిలిచింది. పార్టీకి అంకితభావం, కేడర్‌తో అనుబంధం, సామాజిక సేవలు ఆయన ఎదుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.